క్లుప్తంగా

భీమసింగిలో వైద్య శిబిరం



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న ఎస్.వి ఆస్పత్రి వైద్యులు

జామి: భీమసింగి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విజయనగరం ఎస్.వి ఆస్పత్రి సౌజన్యంతో, సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ పాండ్రంకి సంజీవి, రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్ బాలమురళి ఆధ్వర్యంలో ఆదివారం ఉచితవైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 94 మందికి ఎస్.వి ఆస్పత్రి వైద్యులు శిరీష, అనిల్‌కుమార్, నవ్యశృతి, వి.మనోజ్, సుధీర్ తదితరులు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామపెద్దలు సహకారం అందించారు.

ఘనంగా పసలమ్మ పండగ



పసలమ్మ గుడికి వెళుతున్న గ్రామస్తులు

జామి: మండలంలోని పావాడ గ్రామంలో పసలమ్మ పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఏటా వరినాట్లు పూర్తయిన తర్వాత ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు.గ్రామస్తులు ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి చేరుకున్నారు.అనంతరం పాడి పశువులకు పూజలు చేశారు.పశువులకు వ్యాధులు సోకకుండా, పంటలు బాగా పండేలా చూడాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రక్తదానం ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

గంట్యాడ: రక్తదానం ప్రాణదానమని ఎంఆర్ కళాశాల ఎన్‌సీసీ అధికారి కళ్యాణ్ అశోక్ అన్నారు. జరజాపుపేట సాధన యవజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక రెడ్ క్రాస్ సొసైటీలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటిమనిషికి రక్తం దానం చేసి ప్రాణాలు కాపాడగలడన్నారు. రక్త నిల్వల కొరత కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్త నిల్వల కొరత తీర్చేందుకు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సాధన యువజన సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పసుపర్తి వెంకటరమణ, మద్దిల రాంబాబు, తాలాడ రాంబాబు, రెడ్ క్రాస్ సొసైటీ పీఆర్‌ఓ ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

విజయనగరం పూల్‌బాగ్: కోల్‌కతాలోని ఆర్జేకర్ మెడికల్ కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జేవీవీ సమతా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సమతా రాష్ట్ర కన్వీనర్ నిర్మల అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ మహిళా నాయకురాలు డాక్టర్ సన్యాసమ్మ మాట్లాడుతూ.. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు జేవీవీ పోరాటం చేస్తుందన్నారు. ఇటీవల దేశంలో వైద్యులపై దాడి ఘటనలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి.లక్ష్మి, కరుణ, వెంకటరావు, రాజగోపాల్, రమేష్‌రాజా, సాహితి స్రవంతి నాయకులు దివాకర్, చంద్రిక రాణీ, తదితరులు పాల్గొన్నారు.

ఆదినారాయణ స్మారక కళాపీఠం ప్రారంభం

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో ఆదివారం ఆదినారాయణ స్మారక కళాపీఠం ప్రారంభోత్సవంతో పాటు గంటా లక్ష్మి సినీ ఆర్కెస్ట్రా ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12 గంటల పాటు నిరివ్రామంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహుతులను అలరించింది. కళాపీఠం వ్యవస్థాపకురాలు గంటా లక్ష్మి ఆధ్వర్యంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు ఎం.భీష్మారావు, అరుణ దంపతులను, మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ బురిడి అనూరాధా పరశురామ్ దంపతులను, గురువు కంది పాపాయమ్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపుగంటి ప్రకాష్, భోగరాజు సూర్యలక్ష్మి, పంపాన ప్రకాష్, కానుకల కేశవరావు, పి.విజయలక్ష్మి, గంటా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

- క్రమంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- మార్కెట్‌లో చిరుధాన్యాలకు డిమాండ్



కొత్తవలస మండలం చీపురువలసలో సాగులో ఉన్న సజ్జలు

ఆశాజనకంగా చిరుధాన్యాల సాగు



కొత్తవలస మండలం చీడివలసలో కోతదశలో కొర్ర పంట

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గంలో చిరుధాన్యాల సాగు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ పెట్టుబడి, నీటి తడులతో పంట చేతికి అందడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో చిరు ధాన్యాల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. సజ్జలు, కొర్రలు, సామలు, అండుకొర్రలు, రాగులు వంటి చిరుధాన్యాల సాగు విస్తీరణం నియోజకవర్గంలో గణనీయంగా పెరిగింది. కొత్తవలస, వేపాడ, లక్కవరపు కోట మండలాల్లో సుమారు 1500 ఎకరాల్లో ఈ పంట లను సాగుచేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా తక్కువ పెట్టుబడితో, ఎక్కువ లాభాలు వచ్చే సంప్రదాయ పంటల సాగును వ్యవ సాయశాఖ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ప్రోత్సహిస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఈ పంటలను సాగుచేస్తున్నా రు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విత్తనాలను ఉచితంగా అందజేస్తుండడంతో పాటు, పంటలను కూడా కొనుగోలు చేస్తోంది.

ఆరోగ్యానికి మేలు

జీవనశైలి, తీసుకునే ఆహారంలో వచ్చిన మార్పులు వల్ల ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే బీపీ, సుగర్, గుండె సంబంధిత జబ్బులు ప్రస్తుతం వయ స్సుతో సంబంధం లేకుండా వస్తున్నాయి. జంక్ ఫుడ్, ప్రాసెస్‌డ్ ఫుడ్ ఆరోగ్యానికి తీవ్ర చేటుచేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిరుధాన్యాలైన సజ్జలు, కొర్రలు, సామ లు, అండు కొర్రలు, ఊదలు, అరికెలు వంటి వాటిలో ఖనిజాలు, పోషక విలువలు మెండు గా ఉంటాయని, రోగాలను దరి చేరనీయవని అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల్లో కూడా ఆరోగ్యం, పోషకాహార స్పృహ పెరగడంతో చిరుధాన్యాలకు ఆదరణ పెరిగింది. మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ఉత్సాహంగా సాగుచేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గజపతినగరం: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడి, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి శిరీష మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో స్త్రీలకు రక్షణ లేకుండాపోయిందని, చివరకు ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు కూడా రక్షణ కరువైందన్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే వైద్య సిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించా లని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగదీష్, మండల నాయకులు జయ,అంజలి,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరంలో ర్యాలీ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

గజపతినగరం:

స్థానిక బాలికోన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్లు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ చిప్పాడ రమేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధన, చదువులో వెనుకబడిన విద్యార్థుల విద్యాసామర్థ్యం మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సి న చర్యలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు.

20 నుంచి పశువులకు వ్యాక్సినేషన్

గంట్యాడ: మండలంలో ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 19వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశు సంవర్ధకశాఖ ఏడీ రెడ్డి కృష్ణ ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. గ్రామా ల్లో మూడు బృందాలు శిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేస్తారని, పాడి రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. అలాగే 4 నెలల నుంచి 8 నెలల వయసు గల ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు కూడా వేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదిక నేడు

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు తమసమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చని, అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

చినుకు పడితే నరకమే..



ఎస్.కోట ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

శృంగవరపుకోట: ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి సుమారు అర్ధగంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈవర్షం రైతుల్లో సంతోషాన్ని నింపింది. అయితే ఏ మాత్రం వర్షం కురిసినా పట్టణవాసులకు మాత్రం నరకం కనిపిస్తుంటోంది. పట్టణంలో ప్రధాని రహదారి మొత్తం ఆక్రమణలకు గురైంది. స్పందించాల్సిన స్థానిక పంచాయతీ పాలకవర్గం, ఆర్‌అండ్‌బీ అధికారులు ఏనాడూ ఆక్రమణల తొలగింపు ఊసెత్తలేదు. స్థానిక పాలకులు అందినంత పుచ్చుకుని అడ్డగోలు అక్రమణలకు వత్తాసు పలుకుతున్నారు. దీంతో వర్షం వస్తే వీధుల్లో నీరు మొత్తం ప్రధాన రహదారిపైనే పరుగులు తీస్తోంది. ప్రధాన రహదారిలోని అఫీషియల్ కాలనీ జంక్షన్ నుంచి గాయత్రి ఆలయం వరకు రోడ్డు అంతా జలమయం అవుతోంది. మోకాలి లోతు నీటిలో గాతలు ఎక్కడున్నాయో, గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పొడవునా రోడ్డుకు రెండువైపులా డ్రైన్‌లు పూర్తిగా ఆక్రమణలకు గురికావడమే ఈ పరిస్థితికి కారణమని పలువురు చెబుతున్నారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత



విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న చారిటీ గ్రూప్ ప్రతినిధులు

విజయనగరం: నేటి విద్యార్థులే రేపటి పౌరులని, వారిని ఉన్నత విద్యావంతులుగా, మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ అన్నారు. నగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, కార్యసిద్ధి కలిగిన రోజున విద్యార్థులు సత్ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ.. దాతల సహకారంతో గ్రూపు ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ చదువుతున్న పూసర్ల మనోజ్ కుమార్‌కు రూ.31 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కాపుగంటి రవి, పెంటపాటి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్



విజయనగరం టౌన్: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



పూసపాటిరేగలో రాఖీల విక్రయాలు

పూసపాటిరేగ: సోదర భావానికి ప్రతీకగా నిర్వహించుకునే పండగ రక్షాబంధన్. రక్త సంబంధీకులు లేకపోయినా మనకోసం నిలబడే ఆప్తుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదర భావాన్ని పెంపొందించుకోవడానికి రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. అన్నయ్య, తమ్ముడు, అక్క, చెల్లి నేనున్నాంటూ రక్షగా నిలిచే ప్రతి ఒక్కరూ సోదర సమానమే. అందుకే వీరి అనుబంధానికి ప్రతీకగా శ్రావణ మాసంలో పౌర్ణమి నాడు రక్షాబంధన్ పండగ జరుపుకుంటారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మార్కెట్లో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతులతో చూడగానే ఆకట్టుకుంటున్నాయి. దుకాణాలతో పాటు ఆన్‌లైన్‌లో కూడా రాఖీ విక్రయాలు బాగా పెరిగాయి.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బీకే అన్నపూర్ణ రాఖీ పౌర్ణమి విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు ప్రేమసమాజం, వృద్ధాశ్రమం, బధిరుల పాఠశాలలో ఉన్నవారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మికి, జిల్లా రెవెన్యూ అధికారి, జేసీకి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్వారీ పేలుళ్లతో గృహాలకు బీటలు



రిగ్గు బ్లాస్టింగ్‌లను నిలిపివేయాలని కోరుతున్న బొర్రవలస గ్రామ గిరిజనులు



పేలుళ్ల ధాటికి ఇంటి శ్లాబ్ పెచ్చులూడిపోతోందని చూపిస్తున్న గృహ యజమాని

వేపాడ: వీలుపర్తి పంచాయతీ మందపూడి మెట్టపై క్వారీలో చేపడుతున్న భారీ పేలుళ్ల వల్ల తమ ఇళ్లు బీటలు వారుతు న్నాయని మండలంలోని బొర్రవలస గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీలుపర్తి రెవెన్యూలో సర్వే నంబర్‌లు 4, 5లలో అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తున్నారని బొర్రవలసకు చెందిన వంతు గౌరు నాయుడు, పోతుబంది నూక రాజు, పరదేశి, ఏ.లక్ష్మణరావు, ఎస్.సీతారాం, వెలగల రాజు, పి.కన్నయ్య, వెంకటరావు, సూరీడమ్మ, ఎర్రయ్యమ్మ, అక్కల మ్మ, సావిత్రి పి.చెల్లయ్య, పోతుబంది లక్ష్మి, తదితరులు ఆరోపిస్తున్నారు. క్వారీలో చేపడుతున్న రిగ్గు బ్లాస్టింగ్‌లు వల్ల వచ్చే శబ్దాలకు గృహాలు బీటలు వారుతున్నాయని, పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని, ఏ సమయంలో పేలుళ్లు జరుగుతాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భగనుల శాఖ అధికారులు స్పందించి రిగ్గు బ్లాస్టింగ్‌లను అరికట్టాలని, భారీ పేలుళ్లతో తమ ఇళ్లకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాలని కోరుతున్నారు. అయితే ఇదే విషయాన్ని క్వారీ యజమాని వద్ద సాక్షి ప్రస్తావించగా... క్వారీ యజమాని వద్ద ప్రస్తావించగా మందపూడి మెట్టపై క్వారీ నిర్వహణకు బొర్రవలసకు చెందిన ఆరుగురు మినహా మిగతావారంతా అంగీకరించారని, అనుమతులతోనే క్వారీ నడుపుతున్నామని వివరించారు.

మట్టి గణపతితో పర్యావరణాన్ని కాపాడుకుందాం



కళాకారులకు అవగాహన కల్పిస్తున్న ఆశయ సంస్థ అధ్యక్షుడు రమణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): పర్యావరణ హితం మట్టిగణపతి విగ్రహాలనే పూజిద్దామని, కళాకారులు కూడా మట్టివిగ్రహాల తయారీకే ప్రాధాన్యం ఇవ్వా లని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. గరివిడి పట్టణంలోని రైల్వే బ్రిడ్జి డౌన్‌లో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న కోల్‌కతా కళాకారులకు ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే వినాయక విగ్రహాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిళ్లు తోందన్నారు. విగ్రహాలను చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేసేటప్పుడు నీరంతా కలుషితమవుతోందని వివరించారు. మట్టి విగ్రహాలనే తయారు చేయాలని సూచించారు.

ఆఖరి మజిలీకి అవస్థలు



మృతదేహాన్ని రైవాడ కాలువలో నుంచి శ్మశాన వాటికకు తరలిస్తున్న చినగుడిపాల పంచాయతీలోని సిరవరపు కళ్లాల వాసులు (ఫైల్)

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికలకు దారి లేకపోవడంతో ఆఖరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే వారి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. చినగుడిపాల పంచాయతీ శివారు సిరవరపు వారి కళ్లాలకు చెందిన శ్మశాన వాటిక గ్రామ సమీపంలోని నాయుడు చెరువు వద్ద ఉంది. అయితే ఈ శ్మశాన వాటికకు మృతదేహాలను తరలించాలంటే రైవాడ జలాశయం కాలువను దాటాలి. కాలువలో పీకల్లోతు నీటిలో నుంచే పాడె మోసుకుంటూ వెళ్లాలి. వర్షాకాలంలో ఈకాలువ ఉధృతంగా ప్రవహిస్తుంటోంది. ఆ సమయాల్లో మృతదేహాలను అంత్యక్రియల కోసం శ్మశాన వాటికకు తరలించేందుకు ఇక్కడి ప్రజలుపడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అధికారులు స్పందించి కాలువపై కల్వర్టు నిర్మించి సమస్యను పరిష్కరించాలని సిరవరపువారి కళ్లాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. అలాగే కృష్ణారాయుడుపేట గ్రామంలో బ్రాహ్మణ,వైశ్యులకు మినహా మిగతా వారికి సంబంధించిన శ్మశాన వాటికకు రోడ్డు సదుపాయం లేదు. మృతదేహాలను బుర్రెమ్మ గెడ్డలోంచి వట్టి కెల్ల చెరువు గట్టు మీదుగా కంసాలి చెరువు దగ్గర ఉన్న శ్మశానికి పొలాల గట్లలపై నుంచి తీసుకెళ్లాల్సివస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



యాగశాలలో సుందరాకాండ హవనం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: శ్రావణమాసం సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం చేపట్టిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనాన్ని నిర్వహించారు. అనంతరం వెండి మంటపం వద్ద సీతారామస్వామిని పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. స్వామికి తలంబ్రాల సేవ చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రావణమాసం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. విఖనస జయంతి సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సాయిరామాచార్యులు తెలిపారు.

విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

విజయనగరం ఫోర్ట్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సుంకరి గణేష్ అన్నారు. ఆదివారం విజయనగరంలో తరగతులు నిర్వహిస్తున్న పలు జూనియర్ కళాశాలలు, విద్యాసంస్థల నుంచి విద్యార్థులను బయటకు పంపించేశారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ నేతలు శ్రీనివాస్, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.